వాకింగ్

ఉరుకులు పరుగుల జీవితం వల్ల ఇప్పుడు చాలా మంది ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారనే చెప్పాలి. గతంలో ఎవరైనా వ్యాధుల బారిన పడ్డారంటే అప్పటికి వారి వయసు అరవై దాటి ఉండేది. కానీ ఈ కాలంలో వయసుతో సంబంధం లేకుండా అన్ని వయసుల వారు ఏదో ఒక అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారే అని చెప్పక తప్పదు. అందుకే ప్రతి ఒక్కరు రోజుకు కనీసం పదివేల అడుగులైనా నడవాలని వైద్యులు సూచిస్తున్నారు. నడక వల్ల అనేక సమస్యలు దూరమవుతాయంటున్నారు.


వ్యాయామం చేస్తున్న మహిళలు


ఇందిరా మున్సిపల్ స్టేడియంలో వాకింగ్ చేస్తున్న సీనియర్ సిటిజన్లు, యువకులు

- నడకతో చక్కని ఆరోగ్యం
- రోజూ నడవాలని సూచిస్తున్న వైద్యులు
- నిత్యం వాకర్లతో సందడిగా ఇందిరా మున్సిపల్ స్టేడియం

జగదాంబ: ఇంటా బయటా పని ఒత్తిడి వల్ల చాలా మంది మధ్య వయస్కులు కూడా వృద్ధుల్లా కనిపిస్తున్నారు. మానసిక, శారీరక సమస్యలతో రోజులు నెట్టుకొస్తున్నారు. వీటిని అధిగమించాలంటే నడక చక్కని పరిష్కారమని డాక్టర్లు చెబుతున్నారు. పైగా కరోనా తర్వాతి కాలం నుండి చాలా మందికి ఆరోగ్యంపై అవగాహన పెరిగి వాకింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్ వంటివి చేస్తూ ఆరోగ్య రక్షణ పట్ల శ్రద్ధ వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం నడక లేదా వ్యాయామం చేస్తున్నారు. డాక్టర్లు కూడా ఏ వ్యాధి వచ్చినా విశ్రాంతి తీసుకోమని చెప్పడానికి ముందు రోగుల వయసును బట్టి రోజువారీ నడక అలవాటు చేసుకోమంటున్నారు.

ఓపెన్ జిమ్‌లతో అందరికీ ఆరోగ్యం..

జీవీఎంసీ పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ములు ఇప్పుడు అందరికీ వరంగా మారాయి. పేదలు కూడా జిమ్‌లకు వెళ్లి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలనే ధ్యేయంతోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని చోట్లా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. డబ్బులిచ్చి ఫిజియోథెరపీ వంటివి చేయించుకోలేని వారికి ఉపయోగపడేలా ఓపెన్ జిమ్‌లలో అందుకు తగ్గ పరికరాలు గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలవతో ఏర్పాటయ్యాయి. ఇప్పుడు దక్షిణ నియోజకవర్గంలో ఉన్న ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆ ప్రాంతంలో ఉండే వాళ్లంతా చక్కగా ఉపయోగించుకుంటూ ఆరోగ్యం కాపాడుకుంటున్నారు.


జాగింగ్ చేస్తున్న కిక్ బాక్సింగ్ చిన్నారులు

క్రమం తప్పని నడకతో మేలు..



నడక అందరికీ అవసరం. ఉదయం కానీ సాయంత్రం కానీ క్రమం తప్పకుండా నడిస్తే అనేక ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు. ప్రస్తుతం ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్, బయట తాగుతున్న జ్యూస్‌ల వల్ల ఆరోగ్యం మాట దేవుడెరుగు కచ్చితంగా కొలెస్ట్రాల్, షుగర్ వంటి వ్యాధుల బారిన పడతాం. వాటిని నివారించడంలో నడక మొదటి స్థానంలో ఉంది. ఎక్కడ చిన్న గ్రౌండ్ దొరికినా, ఖాళీ స్థలం కనబడినా నడవాలి. దీని వల్ల అనవసరపు క్యాలరీలు ఖర్చయి ఆరోగ్యం చేకూరుతుంది.

– డాక్టర్ సందేష్, ప్రసాద్‌గార్డెన్స్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి

టెన్షన్ ఫ్రీ అవుతాం..



రోజు నడక వల్ల అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. టెన్షన్ల వల్ల వస్తున్న సమస్యలకు దూరంగా ఉండవచ్చు. రోజులో కొద్ది సమయం కేటాయిస్తే ఆరోగ్యం చేకూరుతుంది. ఇది మన చేతుల్లోనే ఉంది. ఆరోగ్యం పట్ల కొద్దిపాటి శ్రద్ధతో చక్కటి ఫలితాలు కనిపిస్తాయి.

– పద్మ, జీవీఎంసీ 34వ వార్డు

ఓపెన్ జిమ్‌లు వరం..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు పేదవాళ్లకు వరం అనే చెప్పాలి. వేలకు వేలు ఖర్చు చేసి వ్యాయామం సెంటర్లకు వెళ్లలేని వారు ఓపెన్ జిమ్‌లకు వెళ్లి వాకింగ్, ఎక్సర్‌సైజ్‌లు చేసుకుని ఆరోగ్యం కాపాడుకుంటున్నారు.

– దీప్తి, జీవీఎంసీ 39వ వార్డు

పిల్లలతో జాగింగ్ చేయిస్తా



మున్సిపల్ స్టేడియంలో బాక్సింగ్ నేర్పిస్తున్నాను. బాక్సింగ్ కోచ్‌గా ముందుగా పిల్లలతో అరగంట జాగింగ్ చేయించి తర్వాత శరీరం అంతా ఫ్రీ అవడానికి ఎక్సర్‌సైజులు చేయిస్తాం. ఇది బాక్సింగ్‌కు ముందు చేయించడం వల్ల పిల్లలు చురుగ్గా ఉంటారు.

– దుర్గ, బాక్సింగ్ కోచ్, కల్లుపాకలు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ల నియామకం


డాక్టర్ జహీర్ అహ్మద్


ఐహెచ్ ఫరూఖీ

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా దక్షిణ నియోజకవర్గానికి చెందిన డాక్టర్ జహీర్ అహ్మద్, ఐహెచ్ ఫరూఖీని నియమించారు.

వేడుకగా అఖండ భగవన్నామ సంకీర్తన


మాట్లాడుతున్న సమితి చైర్మన్ వెంకట్రావు

దాబాగార్డెన్స్: విజయదశమిని పురస్కరించుకుని రామ్‌నగర్ రాఘవేంద్రస్వామి మఠంలో ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో దసరా సంగీత మహోత్సవం పేరిట గురువారం 12 గంటల పాటు నిర్వహించిన అఖండ భగవన్నామ సంకీర్తన ఆధ్యాత్మిక చైతన్యం నింపింది. సమితి చైర్మన్ వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమితి శిష్యులు, నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు పలు సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సమితి ప్రతినిధులు కె.సుబ్రహ్మణ్యం, పి.జగన్మోహనరావు, జి.మధుబాబు, మధుసూదన రావు, నాగేశ్వరరావు, సమితి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిరులతల్లికి క్షీరాభిషేకం


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న కంచర్ల కుటుంబ సభ్యులు


దాబాగార్డెన్స్: ప్రముఖ సంఘ సేవకుడు కంచర్ల రాంబ్రహ్మం శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని కంచర్ల రాంబ్రహ్మం అండ్ సన్స్ సంస్థ వారం రోజుల పాటు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేపడుతోంది. పాతనగరంలోని స్వామి వివేకానంద సేవా సంస్థ వేదికగా ప్రతి రోజూ 1000 మంది పేదలకు ఈ కార్యక్రమం చేపడుతున్నారు. కంచర్ల రాంప్రసాద్, కంచర్ల అన్నపూర్ణ ప్రతిరోజు కార్యక్రమాన్ని రాంబ్రహ్మం పేరిట నిర్వహించనున్నారు. అలాగే సంస్థ సభ్యులు చేస్తున్న సేవలకు కానుకలు అందజేశారు. శుక్రవారం నాటి కార్యక్రమంలో కంచర్ల రాంబ్రహ్మం అండ్ సన్స్ సంస్థ ఎండీ కంచర్ల కృష్ణకుమార్, రేవతి, కంచర్ల రాంప్రసాద్, కంచర్ల అన్నపూర్ణ రాంబ్రహ్మం చిత్రపటానికి పూల మాలలు వేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అంతా సమయ పాలన పాటించాలని, రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. శుక్రవారం ఆయన బుచ్చిరాజుపాలెం, లక్ష్మీనగర్, స్వతంత్రనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (యూపీహెచ్‌సీ) సందర్శించారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆరోగ్య పథకాలపై అవగాహన ఉండాలన్నారు. వైద్యులు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు



పైడిరాజును అభినందిస్తున్న కల్నర్ ఎస్ఎస్ షిండే

దాబాగార్డెన్స్: మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్ 103 ఏళ్ల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్టేషన్‌రోడ్డులో ఉన్న కమాండింగ్ వర్క్స్ ఇంజినీరింగ్ (సీడబ్ల్యూఈ–1) శాఖలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులను కమాండర్ కల్నల్ ఎస్ఎస్ షిండే అవార్డులందజేసి అభినందించారు. ఎంఈఎస్ సీడబ్ల్యూ–1లో అనేక సంవత్సరాలుగా పనిచేసి పదవీ విరమణ చేసిన తాలాడ పైడిరాజు సేవలను గుర్తించి, తిరిగి రెండేళ్ల కిందట కాంట్రాక్ట్ బేసిస్‌పై విధుల్లోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అతన్ని కల్నల్ ఎస్ఎస్ షిండే, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రిలకు ఘన నివాళి


గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి తదితరులు


గాంధీకి నివాళులర్పిస్తున్న మేయర్, అధికారులు

దాబాగార్డెన్స్: మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిలకు మేయర్ పీలా శ్రీనివాసరావు నివాళులు అర్పించారు. ముందుగా గాంధీ పార్కులో ఉన్న గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహాలకు అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్‌తో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో : మహారాణిపేట: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి గురువారం జరిగింది. జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ సత్యం, అహింసా మార్గాల్లో పయనించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి నేలకూలిన చెట్లు


అల్లిపురం మెయిన్‌రోడ్డులో విరిగిపడ్డ కొబ్బరిచెట్టు


బీఆర్ రెడ్డి జంక్షన్‌లో విరిగిపడిన చెట్టు కొమ్మలు

అల్లిపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి అల్లిపురంలో పలుచోట్ల చెట్లు నేలకూలాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేని వర్షంతో పాటు గాలులు వీయటంతో అల్లిపురం, మెయిన్‌రోడ్డులో కొబ్బరిచెట్టు విరిగి పడిపోవటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. డీఆర్ఎం కార్యాలయం రోడ్డులో రావిచెట్టు కొమ్మలు విరిగి పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

భయపెడుతున్న భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు


కేజీహెచ్ ఓపీ గేట్ వద్ద కూలేందుకు సిద్ధంగా ఉన్న ఫ్లెక్సీ.. కటౌట్


అక్కయ్యపాలెం జాతీయ రహదారిపై ఇలా..

దాబాగార్డెన్స్: ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసరంగా ఫ్లెక్సీ కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. అవి చిన్నపాటి ఫ్లెక్సీలు అనుకుంటే పొరపాటే.. ఆకాశమంత పొడవునా.. జీవీఎంసీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే వాటిని కూటమి నేతలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అవి ఎంత ప్రమాదమో తెలిసినప్పటికీ అధికారులు కూడా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్న వారి నుంచి జీవీఎంసీకి చెల్లించాల్సిన పన్ను కూడా కట్టడం లేదు. అటువంటి వారిపై దృష్టి కేంద్రీకరించి వారి నుంచి పన్ను వసూలు చేయాలి. లేదంటే వాటిని వెంటనే తొలగించాలి. అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తుండడంతో నగరంలో ఫ్లెక్సీలు రాజ్యమేలుతున్నాయి. అధినాయకుడు జన్మదినోత్సవాలు.. లేదా అధినాయకుడు విశాఖ వస్తున్న సందర్భాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి.. కార్యక్రమాలు పూర్తయిన తర్వాత వాటిని తొలగిస్తే బాగుండేది. జీవీఎంసీ పరిధిలో మాత్రం అలా జరగడం లేదు. ఫలితంగా గత రెండు రోజులుగా విశాఖలో కురిసిన వర్షాలు.. మరీ ముఖ్యంగా వీచిన ఈదురుగాలులకు ఫ్లెక్సీలు భయాందోళనలకు గురి చేశాయి. ఎప్పుడు ఎవరిపై కూలుతాయో తెలియని పరిస్థితి. సిటీ పరిధిలో వందలాది ఫ్లెక్సీలు కూలాయి. మరికొన్ని భయంకర వాతావరణంలో కూలేందుకు సిద్ధంగా ఉన్నా.. వాటిని ఇటు అధికారులు గానీ.. అటు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్న నిర్వాహకులు కానీ తొలగించలేదు. అవి కూలి ఎవరికైనా ప్రమాదం జరిగితే ఆ బాధ్యత ఎవరిది?

బీచ్‌లో వ్యర్థాలు కలవకుండా చూడాలి


కాలువల ద్వారా వ్యర్థాలు, మురుగునీరు బీచ్‌లో కలుస్తుండడాన్ని చూపిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

దాబాగార్డెన్స్: కాలువల్లో వ్యర్థాలు సముద్రంలో కలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఎమిదవ వార్డు సాగర్‌నగర్ వద్దనున్న సివరేజ్ పంప్‌హౌస్ ప్లాంట్‌ను ప్రధాన ఇంజినీర్ పి.వి.వి.సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. కాలువల్లో వ్యర్థాలు బీచ్‌లో కలవకుండా చూడాలని దానివల్ల అనేక సమస్యలు వస్తున్నాయని అన్నారు. కాలువల్లో స్క్రీనింగ్ ఎందుకు ఏర్పాటు చేయలేదని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఎవరూ కాలువల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలని సహాయ ఇంజినీర్ శ్రీనివాసరావును ఆదేశించారు. ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఏఎంవోహెచ్ నరేష్‌కుమార్, కార్యనిర్వహక ఇంజినీర్లు ఏడుకొండలు, సుధాకర్ పాల్గొన్నారు.

పలు రూపాల్లో దుర్గమ్మ దర్శనం


రాజరాజేశ్వరీదేవిగా దుర్గాలమ్మ


విజయ దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి


సాగర గిరి కనకదుర్గమ్మగా దుర్గమ్మ


దుర్గాదేవికి పూజలు చేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన వేంచేసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిసాయి. ఉత్సవాలచివరి రోజున కన్యకాపరమేశ్వరి విజయ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలవిరాట్‌కు పాలు, పెరుగు, గంధం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో ప్రత్యేకాభిషేకం జరిపారు. దేవాలయ మండపంలో ఆస్థాన పురోహితుడు ఆర్‌బీబీ కుమార్ శర్మ నేతృత్వంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో చండీ హోమం, శమీపూజ జరిపారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమా వెంకట బాలాజీకుమార్, ఉత్సవ కమిటీ చైర్మన్లు కంకటాల సతీష్, పూసరల సురేష్‌కుమార్, సుగ్గశివ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవిగా దుర్గాలమ్మ..

వెలంపేటలో వెలసిన దుర్గాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసాయి. చివరి రోజున అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు, మాల ధరించిన భవానీలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయఈవోపైలా శేఖర్‌బాబు, సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

వాసుపల్లి కార్యాలయంలో..

మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ కార్యాలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులకు ఆయన దసరా కానుకలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వాసుపల్లి తల్లి అమ్మాజీ, సతీమణి ఉష, కుమారుడు సూర్య, కోడలు లక్ష్మీ సౌందర్య రాశి, గోవింద్ సాకేత్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగర గిరి కనకదుర్గమ్మ ఆలయంలో..

అల్లిపురం: యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ దేవాలయంలో గురువారంతో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసాయి. ఈ సందర్భంగా అమ్మవారు భక్తులకు సాగరగిరి కనకదుర్గమ్మగా దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. శుక్రవారం సాయంత్రం అమ్మవారి పూజ ఉద్వాసన చేపట్టిన అనంతరం అమ్మవారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు


స్వర్ణ కవచ అలకారంలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో గల కనకమహాలక్ష్మి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు, విజయదశమి సందర్భంగా అమ్మవారిని స్వర్ణ కవచ అలంకారంలో అలంకరించి, 108 బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె. రాజేంద్రకుమార్, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంలో ఆయనో స్ఫూర్తి


రక్తదానం చేస్తున్న జవహర్

దాబాగార్డెన్స్: నగరానికి చెందిన వంకాయల జవహర్ వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు. అలాగే ప్రేమసమాజం, భారత్ వికాస్ పరిషత్‌లో, ఆర్యవైశ్య యువజన సంఘంలో జీవితకాల సభ్యుడిగా సేవలందిస్తున్నారు. అంతే కాకుండా ఆయన ఇప్పటి వరకు 128 సార్లు రక్తదానం చేసి రక్తదాతగా పలువురికి ఆదర్శంగా నిలిచారు. అత్యధిక సార్లు రక్తదానం చేసినందుకుగాను ఇటీవల వరల్డ్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బెస్ట్ సోషల్ సర్వీస్ అండ్ బెస్ట్ రోల్ మోడల్, బెస్ట్ బ్లడ్ డోనర్‌గా అవార్డు పొందారు. 1990 నుంచి ఇప్పటి వరకు 128 సార్లు రక్తదానం చేశారు. ఏడాదికి 3 నుంచి 4 సార్లు దానం చేయడమే కాక రక్తదాన శిబిరాలు నిర్వహించి 1500 మందిచే రక్తదానం చేయించారు. వీరి కుటుంబమంతా మరణానంతరం అవయవ దానం దానం చేసేందుకు ఆంధ్రా మెడికల్ కళాశాలకు అంగీకార పత్రం అందజేశారు. అలాగే నేత్రదానం చేసేందుకు ఐ బ్యాంకుకు అంగీకార పత్రం అందజేశారు. జవహర్ సేవలను గుర్తించి రెండు తెలుగు రాష్ట్రాలు పలు అవార్డులు అందజేశాయి.

వైభవుడి దివ్యక్షేత్రంలో ముగిసిన త్రిరాత్రి ఉత్సవాలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో దసరా త్రిరాత్రి ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా పద్మావతి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు, సహస్రనామార్చన చేశారు. వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారిని ఆలయ ప్రదక్షిణ చేయించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు దసరా దశమి ప్రాధాన్యంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఆలయ కార్యనిర్వాణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇమామ్, మౌజన్‌ల జీతాల కోసం వినతి


వినతి పత్రం అందజేస్తున్న ముకర్రమ్ హుస్సేన్, ఇతర ముస్లింలు

దాబాగార్డెన్స్: మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజన్‌ల జీతాలు, మసీదుల మెయింటెనెన్స్ చార్జీలు, దుల్హన్ పథకం (పేద ఆడపిల్లల వివాహాలకు), రంజాన్ తోఫా వంటి పథకాల అమలుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్‌బోర్డు సభ్యుడు ముకర్రమ్ హుస్సేన్, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును శుక్రవారం కోరారు. వినతి పత్రంలో ముకర్రమ్ హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 10 వేల మసీదులు ఉన్నాయని, వాటిలో 70 శాతం మసీదులకు ఎటువంటి ఆదాయం లేదని తెలిపారు. గత 9 నెలలుగా ఇమామ్, మౌజన్‌లకు జీతాలు విడుదల కాకపోవడంతో వారి కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇమామ్–మౌజన్ జీతాలతో పాటు, మసీదు మెయిం టెనెన్స్‌కు రూ. 5 వేలు, పేద ముస్లిం ఆడపిల్లల వివాహాలకు రూ. లక్ష, ఉన్నత చదువులకు సాయం వంటివి ప్రకటన చేసి 3 నెలలు గడిచినా, ఆచరణలోకి రాలేదని పల్లా దృష్టికి తీసుకెళ్లారు.